

నిఘా నీడన లంబసింగి

పోలీసులు నిరంతర గస్తీ .. రాత్రి వేళల్లో విస్తృత సోదాలు

అభిజిత్ కంపెనీలో మెరుపు సమ్మె

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ·7లో

విద్యార్థుల మందు పార్టీ

అంతా పదో తరగతిలోపు వారే...



మందు పార్టీలో మునిగి తేలుతున్న విద్యార్థులు

చోడవరం, జనవరి 2:

వారంతా ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు...డిసెంబరు 31వ తేదీ రాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మందు పార్టీ చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు 31వ తేదీ రాత్రి పక్కన నిర్మాణంలో ఉన్న భవనంలో మందు పార్టీ చేసుకున్నారు. వీరితో స్థానికంగా ఉన్న మరో ఇద్దరు యువకులు జత కలిశారు. బీరు తాగుతుండడాన్ని ఆ ఇద్దరు యువకులలో ఒకరు తన సెల్‌ఫోన్‌తో చిత్రీకరించడంతో విద్యార్థులు గొడవకు దిగారు. ఆ తరువాత కొంతసేపటికి అంతా సద్దుమణిగింది. అయితే విద్యార్థుల మందు పార్టీకి సంబంధించిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ హాస్టల్ కొంతకాలం ఇన్‌చార్జి వార్డెన్ ఆధ్వర్యంలో నడిచింది. ఇప్పుడా ఇన్‌చార్జి వార్డెన్ చిన్నయ్యే రెగ్యులర్ వార్డెన్‌గా బాధ్యతలు చేపట్టారు. వార్డెన్ దిగువ స్థాయి సిబ్బందిపై భారం వేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే విద్యార్థులపై అజమాయిషీ కొరవడిందని స్థానికు అంటున్నారు.

పది గంటల వరకూ హాస్టల్‌లోనే ఉన్నా: వార్డెన్ చిన్నయ్య

కాగా హాస్టల్ విద్యార్థులు అందరూ మందు పార్టీలో మునిగితేలుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నా వార్డెన్ చిన్నయ్య మాత్రం 31వ తేదీ రాత్రి పది గంటల వరకూ తాను హాస్టల్‌లోనే ఉన్నానని, ఆ తరువాత ఇంటికి వెళ్లానని చెబుతున్నారు. తాను హాస్టల్ నుంచి వెళ్లిన తరువాత విద్యార్థులు ఏం చేశారో తెలియన్నారు. మళ్లీ ఆయనే...ఎవరో తాగుతుంటే చూడడానికి తమ హాస్టల్ విద్యార్థులు వెళ్లారు తప్పితే, వారు తాగలేదని చెప్పడం కొసమెరుపు.

వైసీపీకి దాడి గుడ్‌బై

అధికార పార్టీకి వరుస షాక్‌లు



- పార్టీని వీడుతున్న సీనియర్లు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌ల రాజీనామా
- ఇప్పుడు వీరభద్రరావు కుటుంబం...
- నేడు అమరావతిలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిక



దాడి రత్నాకర్



దాడి జయవీర్



దాడి వీరభద్రరావు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఎన్నికల ముంగిట పలువురు సీనియర్ నేతలు పార్టీని విడిచిపెడుతున్నారు. సుమారు ఏడాదిపాటు విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన పంచకర్ల రమేశ్‌బాబు మూడు, నాలుగు నెలల క్రితం పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన విషయం తెలిసిందే. ఇక ఇటీవల వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో వంశీకృష్ణ జనసేనలో చేరగా, సుధాకర్ టీడీపీలో చేరనున్నట్టు చెబుతున్నారు. తాజాగా అనకాపల్లి జిల్లాలో వైసీపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్, మరో కుమారుడు జయవీర్ మంగళవారం మధ్యాహ్నం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో కలకలం రేపగా, వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది.

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సుదీర్ఘకాలంపాటు తెలుగుదేశం పార్టీలో ఉండి, 2013లో ఆ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఆయన కుమారుడు దాడి రత్నాకర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి ... మిగతా 8వ పేజీలో

రెండు నియోజకవర్గాలకు వైసీపీ కొత్త ఇన్‌ఛార్జిలు

అనకాపల్లికి మలసాల భరత్‌కుమార్ నియామకం

- పాయకరావుపేటకు కంబాల జోగులు
- ప్రస్తుతం రాజాం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం
- వచ్చే ఎన్నికల్లో వీరికే టికెట్లు?



మలసాల భరత్



కంబాల జోగులు



గొల్ల బాబూరావు

అనకాపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం జిల్లాలో రెండు అసెంబ్లీ నియోకవర్గాలకు కొత్త ఇన్‌ఛార్జిలను నియమించింది. పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో కొత్తగా ఇన్‌ఛార్జిలను నియమిస్తున్నట్టు కొద్ది రోజుల నుంచి ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా అనకాపల్లి, పాయకరావుపేట నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జిల పేర్లను వైసీపీ అధిష్ఠానం మంగళవారం ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జిగా కశింకోట మండలానికి చెందిన మలసాల భరత్‌కుమార్‌నియమితులయ్యారు. మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ కుమారుడైన ఇతను ఇటీవల వరకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. కాగా మంత్రి అమర్‌కు మరే ఇతర నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. ఇదిలావుండగా పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు స్థానంలో విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులను వైసీపీ అధిష్ఠానం నియమించింది. జోగులు 2004 ఎన్నికల్లో పాలకొండ నుంచి టీడీపీ తరపున, 2014, 2019 ఎన్నికల్లో రాజాం నుంచి వైసీపీ తరపున పోటీచేసి గెలుపొందారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఇన్‌చార్జిగా నియమితులు కావడంతో వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేస్తారని భావిస్తున్నారు.

ఊపందుకున్న బెల్లం లావాదేవీలు

- ఎన్టీఆర్ మార్కెట్ యార్డుకు 13,947 దిమ్మలు రాక
- ప్రస్తుత సీజన్‌లో ఇవే అత్యధికం



యార్డులో ప్లాట్‌ఫారంపై బెల్లం దిమ్మలు

అనకాపల్లి టౌన్, జనవరి 2: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డుకు కొత్త బెల్లం రాక ఊపందుకుంది. సంక్రాంతి పండుగ సమీస్తుండడంతో రైతులు బెల్లం దిమ్మలను యార్డుకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మంగళవారం 13,947 బెల్లం దిమ్మలు వచ్చాయి. అత్యధిక బెల్లం దిమ్మలు రావడం ప్రస్తుత సీజన్‌లో ఇదే ప్రథమం అని వ్యాపారులు వెల్లడించారు. ఆది, సోమవారాలు సెలవు దినాలు కావడంతో మంగళవారం అధిక సంఖ్యలో బెల్లం దిమ్మలు వచ్చినట్టు పేర్కొన్నారు. ఒకటో రకం వంద కిలోలు రూ.4,500, రెండో రకం రూ.4,250, మూడో రకం రూ.3,730 ధరలు పలికాయి.

కొణతాలతో కేవీపీ మంతనాలు ?

కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఆహ్వానం

ఆయన వెంటే వైసీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి?



కొణతాలకు పుష్పగుచ్ఛంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ మార్పులు చకచకా చోటుచేసుకుంటున్నాయి. అధికార పార్టీ వైసీపీ కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను మార్చడం, ఎన్నికల బరిలో ఎవరు ఉంటారో స్పష్టత ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో టికెట్లు ఆశిస్తున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా చేసిన కొణతాల రామకృష్ణ ఇప్పుడు రాజకీయంగా మళ్లీ క్రియాశీలకం అవుతున్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కొణతాల...జగన్ వెంట నడిచారు. అయితే ఆయన విధానాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరలేదు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయితే గత కొద్దిరోజులుగా ఆయన మళ్లీ తన వర్గంతో చర్చలు జరుపుతున్నారు. ఉత్తరాంధ్రాతో పాటు ముఖ్యంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఆయన శిష్యులు చాలామంది ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. ఆమె రాష్ట్ర పార్టీ బాధ్యతలు స్వీకరిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తరఫున కేవీపీ రామచంద్రరావు పాత కాంగ్రెస్ నాయకులందరితో చర్చలు జరుపుతున్నారు. కేవీపీకి కూడా కొణతాల రామకృష్ణ సన్నిహితుడే. కాంగ్రెస్‌లోకి రావాలని కేవీపీ ఆహ్వానించినట్టు, అందుకు కొణతాల అంగీకరించినట్టు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ వైపు నాగిరెడ్డి అడుగులు?

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేమని గాజువాక ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వైసీపీ అధిష్ఠానం చాలా స్పష్టంగా చెప్పేసింది. పార్టీ అవకాశం ఇస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన తనయుడు దేవన్‌రెడ్డి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అధిష్ఠానం టికెట్ ఇవ్వబోమని చెప్పడంతో పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. పార్టీ పెద్దలు బుజ్జగించి తొందర పడవద్దని వారించారు. రెండు రోజుల క్రితం గాజువాకలో జరిగిన పార్టీ సమావేశంలో కూడా నాగిరెడ్డి వర్గీయులు ఆయనకే టికెట్ ఇవ్వాలని పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ముందు డిమాండ్ చేశారు. అయితే ఉరుకూటి చందుకే టికెట్ ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో తిప్పల కుటుంబం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. ఈ కుటుంబానికి గతంలో కాంగ్రెస్ పార్టీతోనే సుదీర్ఘ అనుభవం ఉంది. ఆ పార్టీ నుంచే తిప్పల సోదరుడు గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వీరంతా కొణతాలకు శిష్యులు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి షర్మిల సారథ్యం వహించనున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గాజువాక నుంచి పోటీ చేయడానికి అవకాశం ఇస్తే ఆ పార్టీలో చేరడానికి నాగిరెడ్డి కుటుంబం ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది.

ఉన్నత శిఖరానికి రైతుబిడ్డ

ఎన్‌డీఏలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా బెన్నవోలు యువకుడు



మజ్జి వెంకట సాయి

- 6వ తరగతి నుంచి ప్లస్2 వరకు కోరుకొండలో విద్యాభ్యాసం
- యూపీఎస్‌సీ ద్వారా ఎన్‌డీఏకు ఎంపిక
- పుణె, హైదరాబాద్‌లో శిక్షణ
- బెంగళూరు కేంద్రంగా ఫ్లయింగ్ అధికారిగా బాధ్యతలు



ఫ్లయింగ్ శిక్షణలో వెంకట సాయి

చోడవరం, జనవరి2: మండలంలోని బెన్నవోలు గ్రామానికి చెందిన మజ్జి వెంకట సాయి నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ)లో ఫ్లయింగ్ అధికారిగా నియమితులయ్యారు. ఎన్‌డీఏలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న వెంకటసాయి బెంగళూరు కేంద్రంగా విధులు నిర్వహించనున్నారు.

చోడవరం మండలం బెన్నవోలు గ్రామానికి చెందిన వెంకట సాయి కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ప్లస్ 2 వరకు చదివారు. అనంతరం యూపీఎస్సీ నిర్వహించిన ఎన్‌డీఏ పరీక్ష రాశారు. మంచి ర్యాంకు సాధించడంతో అనంతరం ఎస్‌ఎస్‌బీ (సర్వీస్ సెలక్షన్ బోర్డు) ఐదు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎన్‌డీఏకు ఎంపికయ్యారు. తరువాత కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టం(సీపీఎస్ఎస్) టెస్ట్‌లో కూడా విజయం సాధించారు. శిక్షణలో భాగంగానే ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ఏఈసీ (అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్)లో బీటెక్ పూర్తి చేశారు. ఎన్‌డీఏ పుణెలో మూడేళ్లపాటు శిక్షణ పొందారు. చివరగా హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడెమీలో ఏడాది శిక్షన పొందారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న వెంకటసాయి ఫ్లయింగ్ అధికారిగా బెంగళూరు కేంద్రంగా బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా వెంకటసాయికి విమానం నడపాలని చిన్నతనం నుంచే కోరిక ఉండేది. ఆర్మీలో పనిచేయాలని తండ్రి కూడా కోరేవారు. ఎన్‌డీఏలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నియమితులు కావడం ద్వారా ఇద్దరి కోరికలు నెరవేరాయి. కాగా వెంకటసాయి తండ్రి మజ్జి గౌరీశంకర్ గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్, తల్లి మజ్జి లక్ష్మి బెన్నవోలు సర్పంచ్‌గా పనిచేశారు. వెంకటసాయి తమ్ముడు దుర్గా ప్రసాద్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

జిల్లా కలెక్టర్ అభినందన

ఎన్‌డీఏలో ఫ్లయింగ్ అధికారిగా శిక్షణ పూర్తి చేసుకున్న వెంకట సాయి, జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టిని మర్యాదపూర్వకంగా కలిసారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి, అంచెలంచెలుగా ఎదిగి ఎన్‌డీఏలో ఫ్లయింగ్ అధికారిగా నియమితులు కావడంపై కలెక్టర్ అభినందించారు.



మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

ఉరితాళ్లతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన

అనకాపల్లి రూరల్, జనవరి 2:

డిమాండ్ల సాధన కోసం గత నెల 20వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కొండకొప్పాకలోని డీఈవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో ఉద్యోగులు మెడకు ఉరితాళ్లు బిగించుకుని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పూడి వెంకటరావు మాట్లాడుతూ, అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని డిమాండ్ చేశారు.



మాడుగులలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలు వినూత్న నిరసన

సమస్యలు పరిష్కరించాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. మూడు వారాలు దాటినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదంటూ దున్నపోతులకు వినతిపత్రాలు ఇచ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు అంగన్‌వాడీల దీక్షా శిబిరాలను సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

పట్నంలో క్షీణిస్తున్న పారిశుధ్యం

మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. నర్సీపట్నం పలు ప్రాంతాల్లో చెత్తచెదారం పేరుకు పోయింది. డంపర్ బిన్లు నిండిపోవడంతో ప్రజలు పరిసరాల్లో చెత్త పడేస్తున్నారు. పారిశుధ్యం క్షీణిస్తుండడంతో అంటువ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా డిమాండ్ల విషయంలో ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా పారిశుధ్య కార్మికులు సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నల్లజెండాలతో ర్యాలీ నిర్వహించారు. - నర్సీపట్నం



పోలీస్ స్టేషన్ పక్కన మెయిన్ రోడ్డులో పేరుకు పోయిన చెత్త

క్రైం... crime news

'తాచేరు'లో వృద్ధురాలి మృతదేహం


రాజులమ్మ (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, జనవరి 2 : మండలంలోని ఎం.కె.వల్లాపురం గ్రామానికి చెందిన మట్టా రాజులమ్మ (72) అనే వృద్ధురాలి మృతదేహం మంగళవారం ముకుందపురంలోని తాచేరు నదిలో బయటపడింది. గత నెల 27వ తేదీన పొలానికి వెళుతున్నానని చెప్పి ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె కొడుకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ముకుందపురం వద్ద తాచేరు నదిలో రాజులమ్మ మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి ఎస్‌ఐ దామోదరనాయుడుకు సమాచారం అందించారు. వెంటనే ఆయన అక్కడికి చేరి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పొలం సమీపంలో ఉన్న నదికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అనకాపల్లి టౌన్, జనవరి 2: స్థానిక అన్నపూర్ణ బ్యాంక్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ ఎన్. సత్యనారాయణ తెలిపారు. గుండాలవీధిలో నివాసముంటున్న మొల్లి సన్నిబాబు తన కుమారుడికి ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి వెడుతుండగా చోడవరం వైపు నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొన్నాడని తెలిపారు. ఈ సంఘటనలో సన్నిబాబుకు తీవ్రగాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, సన్నిబాబు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

వైసీపీ నక్కపల్లి అధ్యక్షుడికి తీవ్ర గాయాలు


గాయపడిన నరసింహమూర్తి

ఎస్.రాయవరం, జనవరి 2: వైసీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తికి అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన స్వగ్రామం సారిపల్లి వానిపాలెం నుంచి అడ్డరోడ్డులో ఇంటికి బైక్‌పై వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాల య్యాయి. గాయప డిన నరసింహ మూర్తిని అడ్డరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వెంటనే ఆస్పత్రికి చేరుకొని వైద్యులను ఆరా తీయగా.. క్షతగాత్రుడిని విశాఖ తీసుకువెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే బాబూరావు వెంటనే ప్రైవేట్ అంబులెన్స్‌లో నరసింహమూర్తిని అనకాపల్లి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిసింది. ఆయన వెంట ఎమ్మెల్యే బాబూరావు కూడా వెళ్లారు.

పూడిమడక వైన్‌షాపులో చోరీ

అచ్యుతాపురం రూరల్, జనవరి 2: మండలంలోని పూడిమడక ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. రాత్రి సమయంలో షాపులోని రూ.50 వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లు అపహరించినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. షాపులో పనిచేసే వారి చేతివాటమా లేదా నిజంగానే చోరీ జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తమ దృష్టికి వచ్చిందని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

వైద్యుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు?

- ఇంట్లో పనిమనిషి ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు ఆరోపణలు రావడంతో కేజీహెచ్‌లో పనిచేస్తున్న ఒక వైద్యుడిపై మహారాణిపేట పోలీసులు మంగళవారం కేసు నమోదుచేసినట్టు తెలిసింది. సదరు వైద్యుడు లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఆయన ఇంట్లో పనిచేస్తున్న మహిళ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు రామాటాకీస్ సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో సదరు వైద్యుడు ఉన్నట్టు తెలుసుకుని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లారంటున్నారు. మఫ్టీలో ఆస్పత్రికి వెళ్లిన పోలీసులను గుర్తించి వైద్యుడు ...మొదటి అంతస్థు నుంచి వెనుక వైపునున్న ర్యాంప్ మీదుగా కిందకు దిగి పరారైనట్టు సమాచారం. వైద్యుడు తన కారును కూడా ఆస్పత్రి వద్ద వదిలేశారు. ఆయన పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసు గురించి మహారాణిపేట పోలీసులతోపాటు ఈస్ట్ ఏసీపీని సంప్రతించేందుకు యత్నించగా..బిజీగా ఉన్నామని, తర్వాత మాట్లాడుదామంటూ సమాధానం దాటవేశారు.

అట్రాసిటీ కేసులో నలుగురి అరెస్టు

కశింకోట, జనవరి 2 : మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన నలుగురు నిందితులను ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద అరెస్టు చేసినట్టు అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవికుమార్ మంగళవారం రాత్రి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023 డిసెంబరు 31న అర్ధరాత్రి పొన్నాడ యాకోబు (రిటైర్డ్ టీచర్) గ్రామంలో ఉన్న చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రార్థనలకు హాజరై తిరిగి ఇంటికి నడుచుకొని వెళుతుండగా అదే గ్రామానికి చెందిన మంతెన దుర్గా నాగ ఈశ్వర్, చిన్ని మధుమోహన్‌సాయి, పెయ్యిల గణేష్, కలం ఏసు అనే నలుగురు కులం పేరుతో దూషించి, అతనిపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈ మేరకు డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి నలుగురిని అరెస్టు చేశామని సీఐ రవికుమార్ తెలిపారు.

6న నృసింహ దీక్షల విరమణ



సింహాచలం, జనవరి 2: సింహాచలం క్షేత్ర మహాత్మ్యం, సింహాద్రినాథుని అవతార రహస్యం చాటి చెప్పే లక్ష్యంతో భక్తులు నవంబరు 26న స్వీకరించిన నృసింహ దీక్షల విరమణ ఈనెల 6న జరగనుంది. ఇందులో భాగంగా సింహగిరిపై భక్తుల తిరుముడుల స్వీకరణకు చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లను ఈవో సింగాల శ్రీనివాసమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈనెల 6న ఉదయం 7 గంటల నుంచి ఆలయ దక్షిణ రాజగోపురానికి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో చందనస్వాములు ఇరుముడులను సమర్పించాలని ఈవో తెలిపారు. దీక్షల విరమణకు వచ్చే భక్తులకు దేవస్థానం బస్సులలో ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ముందు రోజు ఉచిత వసతి, భోజన సదుపాయాన్ని కలుగజేస్తామన్నారు. దీక్ష ధారులకు ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఏఈఓలు పి.నరసింగరావు, భ్రమరాంబ, ఈఈలు డీజీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

నిఘా నీడన లంబసింగి

» పోలీసుల నిరంతర గస్తీ
» రాత్రి వేళల్లో విస్తృత సోదాలు


ఉదయం లంబసింగిలో మోహరించిన పోలీసులు


మంగళవారం ఉదయం నాలుగు గంటలకు వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతపల్లి, జనవరి 2: ప్రముఖ పర్యాటక ప్రాంతం, ఆంధ్రకశ్మీర్ లంబసింగిపై పోలీసులు నిఘా పెంచారు. మూడు రోజులుగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ గస్తీ నిర్వహిస్తున్నారు. లంబసింగి మీదుగా వచ్చిపోయే వాహనాలు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను విస్తృతంగా సోదాలు చేస్తున్నారు. లంబసింగి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేసేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. దీంతో గత నెల 31వ తేదీ నుంచి మంగళవారం వరకు లంబసింగి, చెరువులవేనం, తాజంగి, రాజుపాకలు తదితర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సీఐ కె.రమేశ్, ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ అధ్వర్యంలో గస్తీ నిర్వహిస్తున్నారు. లంబసింగిలో నూతన సంవత్సర వేడుల్లో మునిగి తేలుదామని ఆశతో వచ్చిన మందుబాబులకు పోలీసులకు కళ్లెం వేశారు. తాజంగి-లంబసింగి, రాజుపాకలు-లంబ్బంగి మార్గాల్లో ఎక్కడా మద్యం తాగడానికి పర్యాటకులకు అనుమతించలేదు. రిసార్ట్ వద్ద కూడా డీజే సౌండ్స్, మద్యం తాగే అవకాశం ఇవ్వలేదు. లంబసింగి జంక్షన్‌లో పోలీసులు బ్రీత్ అనలైజర్ పరీక్షలు, 24 గంటలూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అతి వేగంగా ప్రయాణించిన వాహనాలను స్వాధీనం చేసుకుని మరుసటి రోజు తిరిగి అప్పగిస్తున్నారు. లంబసింగి జంక్షన్, తాజంగి, భీమనాపల్లి వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కేటాయించిన స్థలాల్లో మాత్రమే వాహనాల పార్కింగ్‌కు అనుమతులు ఇస్తున్నారు. పోలీసులు లంబసింగిలో భారీగా మోహరించడం, శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కుటుంబాలతో ఇక్కడికి వచ్చిన పర్యాటకులు ప్రశాంతంగా గడిపి చేసి వెళుతున్నారు. కాగా లంబసింగిలో పర్యాటక సీజన్ ముగిసేంత వరకు పోలీసు గస్తీ కొనసాగుతుందని స్థానిక అదనపు ఎస్పీ శివకిశోర్ తెలిపారు.

ఆర్‌టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» ఎన్‌ఎంయూ అసోసియేషన్ ప్రతినిధుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

మాకవరపాలెం, జనవరి 2: ఏపీఎస్ ఆర్‌టీసీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని రాచపల్లిలో గల కామేశ్వర్మ గుడి వద్ద మంగళవారం ఏర్పాటైన అనకాపల్లి జిల్లా యూనిట్ అసోసియేషన్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. ఈపీఎస్ 95 నుంచి సీపీఎస్‌కు మార్చే గడువును ఎత్తివేసి ఎప్పుడైనా అప్షన్ ఇచ్చుకునే విధానాన్ని అమలు చేయాలని, ఈహెచ్‌ఎస్ నుంచి ఏపీపీటీడీ ఉద్యోగులను మినహాయించి పాత పద్ధతిలోనే వైద్య విధానం కల్పించాలని కోరారు. అలాగే, సంస్థ నుంచి ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఏకపక్షంగా షెడ్యూల్స్ రద్దు చేయాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి మోహన్‌రావు, విజయనగరం జోనల్ కార్యదర్శి మూర్తి, జోనల్ జాయింట్ కార్యదర్శి బోళెం రమణ, ప్రతినిధులు శంకరరావు, సూర్యంతో పాటు నర్సీపట్నం డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం నిర్మాణం

» మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన
» ఏడాదిలోగా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటన

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రూ.6 కోట్లతో మ్యూజియం నిర్మాణానికి మంగళవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మ్యూజియం కోసం రూ.4.69 కోట్లు కేంద్రం ఇవ్వగా సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ రూ.93.8 లక్షలు సమకూరుస్తుందని వివరించారు. మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికాన్ మ్యూజియం, సోలార్ స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సీఈఓ డాక్టర్ జయరామిరెడ్డి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున, జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ డి.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో సెంటర్ డివైడర్ పనులకు ఏర్పాట్లు

నర్సీపట్నం, జనవరి 2 : పట్టణంలోని మెయిన్ రోడ్డులో సెంటర్ డివైడర్ పనులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పాల్‌ఘాట్ కూడలి నుంచి సెట్రింగ్ పనులు మంగళవారం ఆరంభయ్యాయి. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రూ.10.6 కోట్లతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అంబీద్ సెంటర్ నుంచి పాత ఎస్‌బీఐ సెంటర్ వరకు 90 అడుగులు రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ప్రభుత్వ భవనాల తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు తొంభై శాతం పూర్తయ్యాయి. పాల్‌ఘాట్ కూడలిలోని ఎస్సీ బాలికల వసతి గృహం, సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రహరీ గోడలను తొలగించారు. డివైడర్ నిర్మాణం పూర్తిచేసి సంక్రాంతిలోగా బీటీ రోడ్డు వేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

» సూరత్-బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు పొడిగింపు

విశాఖపట్నం, జనవరి 2: సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్, వికారాబాద్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్-వికారాబాద్

07089 నంబరు గల రైలు ఈనెల 7, 14 తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07090 నంబరు గల రైలు ఈనెల 8, 15 తేదీల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 8.30 గంటలకు వికారాబాద్ చేరుతుంది. 07091 నంబరు గల రైలు ఈనెల 9, 16న సాయంత్రం 6.00 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 11.10 గంటలకు బహ్మపూర్ చేరుతుంది. తిరిగి 07092 నం బరు గల రైలు ఈనెల 10, 17న మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైళ్లకు మూడు సెకెండ్ ఏసీ, ఆరు థర్డ్ ఏసీ ఎకానమీ, తొమ్మిది స్లీపర్, రెండు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాస్ కమ్ లగేజీ కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా సూరత్ నుంచి బ్రహ్మపూర్ వచ్చే 09069 నంబరు రైలును ఈనెల 17, 24, 31 తేదీల్లో...బ్రహ్మపూర్ నుంచి సూరత్ వెళ్లే 09070 నంబరు గల రైలును ఈనెల 19, 26, ఫిబ్రవరి 2 తేదీల్లో అందుబాటులో ఉండే విధంగా పొడిగించినట్టు డీసీఎం పేర్కొన్నారు.

అభిజిత్ కంపెనీలో మెరుపు సమ్మె


విధులను బహిష్కరించి కంపెనీలో నుంచి బయటకు వస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అచ్యుతాపురం రూరల్, జనవరి 2: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అభిజిత్ ఫెర్రోటెక్ లిమిటెడ్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. దీంతో నో వర్క్, నో పే అంటూ కంపెనీ యాజమాన్యం మంగళవారం నోటీసు జారీ చేసింది. సోమవారం ఉదయం విధులకు హాజరైన కాంట్రాక్ట్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగి, మిగతా కార్మికులు విధులకు హాజరవకుండా అడ్డుకున్నారు. మంగళవారం కూడా కార్మికులు విధులకు హాజరు కాలేదు. కంపెనీకి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మెరుపు సమ్మెకు దిగడంతో కంపెనీ యాజమాన్యం ఫర్నేస్‌లు నిలిపివేసింది. దీంతో కంపెనీకి నష్టం వాటిల్లిందని, వెంటనే విధులకు హాజరు కావాలని కంపెనీ ఎదుట నోటీసు పెట్టింది. రెండు రోజులు నో వర్క్, నో పే ప్రకటించింది. గతంలో చర్చించిన విధంగా 20 పనిదినాలకు అంగీకారం తెలిపిన వారు వెంటనే కాంట్రాక్టర్‌కు తెలిపి విధులకు చేరాలని యాజమాన్యం పేర్కొంది.

కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా వసంతరావు బాధ్యతల స్వీకారం


వసంతరావు

కొత్తూరు, జనవరి 2 : అనకాపల్లి జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ కె.వసంతరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేర కు విజయవాడ కార్మిక కమిషనర్ ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈయన ఏలేరు సహాయ కార్మిక కమిషనర్‌గా, విశాఖపట్నంలో సోషల్ సెక్యూరిటీ ప్రమోషన్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌పీవో)గా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కార్మికులకు సంక్షేమ పథకాలు అందేంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ స్కీం, ఎన్‌పీఎస్ స్కీమ్‌ను అసంఘటిత కార్మికులు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

» దున్నపోతులకు వినతులు అందజేత... » పరవాడలో నోట్లో గడ్డి పెట్టుకొని నిరసన... » అధికారులిచ్చిన నోటీసులు దహనం



అనకాపల్లిలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



మునగపాకలో దున్నపోతుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు



పాయకరావుపేటలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 2 : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 22వ రోజు చేరింది. ఈ సందర్భంగా నెహ్రూచౌక్‌లో ఆందోళన చేపట్టి దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులు తనూజ, కాసులమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఐదో తేదీ లోపు విధుల్లోకి చేరాలని బెదిరించడం దుర్మార్గమన్నారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలు 22వ రోజు మంగళవారం దున్నపోతుకు తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం నాయకురాలు ఉప్పాడ సత్యవతి, తోపుడు బండ్ల సంఘం అధ్యక్షుడు గౌరీసు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు వీవీ రమణమ్మ మాట్లాడుతూ.. సమ్మె విరమించకపోతే ఉద్యోగం తీసేస్తామని పీవో లలితకుమారి బెదిరించడం తగదన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా బుధవారం కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేస్తామన్నారు.

మునగపాకలో.. అంగన్‌వాడీలు మంగళవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. దున్నపోతుకు వినతిపత్రాన్ని అందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ వేడుకున్నారు. అనంతరం ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఆట పాటలతో హోరెత్తించారు. అంగన్‌వాడీలకు ఆళ్ల మహేశ్వరరావు మద్దతు ప్రకటించారు.

కోటవురట్లలో.. మండలకేంద్రంలో అంగన్‌వాడీలు మంగళవారం దున్నపోతుకు వినతిపత్రాన్ని అందజేశారు. సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు.

నక్కపల్లిలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధర్నా శిబిరం వద్ద దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం సీడీపీవో కార్యాలయం సిబ్బంది వచ్చి అంగన్‌వాడీలకు సమ్మె విరమించాలంటూ నోటీసు ఇచ్చారు. ఈ లేఖను అంగన్‌వాడీ కార్యకర్తలు దహనం చేశారు. అంతకుముందు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.సత్యనారాయణ ధర్నా శిబిరాన్ని సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలకు సంఘీభావం ప్రకటించారు.

ఎస్.రాయవరంలో.. అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని మంగళవారం జనసేన పార్టీ నాయకులు పులి సత్తిబాబు, ఉమ్మడి సంజీవరావు, ప్రసాద్, గణేష్, సేనాపతి బాబూరావు, సందర్శించి, సంఘీభావం తెలిపారు. అలాగే కొరుప్రోలులో సీపీఎం మండల కన్వీనర్ సత్యనారాయణ, అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు.

ఎలమంచిలిలో.. స్థానిక లైనుకొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు, పలువురు టీడీపీ నేతలు మంగళవారం సందర్శించారు. అనంతరం వారికి మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటానికి టీడీపీ అండగా ఉంటుందని రంగనాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి కె.విజయబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్న ఆందోళన 22వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. అంగన్‌వాడీలు నోట్లో గడ్డి పెట్టుకుని నిరసన ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఎస్. రాయవరంలో అంగన్‌వాడీలు చేస్తున్న ధర్నాలో పాల్గొన్న జనసేన నాయకులు



పరవాడలో నోట్లో గడ్డి పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

ఈపీడీసీఎల్ ఏఈపై చర్యలు తీసుకోవాలి

» విద్యుత్ మీటర్లకు లంచం అడుగుతున్నారంటూ ఆందోళన » బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసన

పాయకరావుపేట, జనవరి 2 : విద్యుత్ మీటర్లు వేసేందుకు లంచం అడుగుతున్న స్థానిక సబ్‌స్టేషన్ ఏఈపై చర్యలు తీసుకోవాలని బాధితులు మంగళవారం వైసీపీ నాయకుడు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. బాధితులు తొలుత విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట, తర్వాత మెయిన్‌రోడ్డు, విద్యుత్ శాఖ ఏడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితులు షరీఫ్, అప్పారావు, శ్రీమన్నారాయణ తదితరులు మాట్లాడుతూ విద్యుత్ మీటర్లు వేసేందుకు ఏఈ ఎం.నాగేశ్వరరావుడబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. మీటర్లు వేసేందుకు దరఖాస్తు చేసుకుంటే స్తంభాలు వేయాలి.. కొత్తగా లైను వేయాలంటూ అధిక మొత్తంలో లంచం డిమాండ్ చేస్తున్నారన్నారు. లేకుంటే మీటర్ల దరఖాస్తును రిజెక్ట్ చేస్తామని బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. స్థానిక రాజుగారిబీడుకు చెందిన ఎం.రాజేష్ అనే వ్యక్తి మాట్లాడుతూ విద్యుత్ మీటర్ వేసేందుకు ఏఈ రూ.40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారని, లేకుంటే ట్రాన్స్‌ఫారమ్ కోసం అప్లై చేసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. విద్యుత్ మీటర్లు వేసేందుకు లంచం డిమాండ్ చేస్తున్న ఏఈపై విచారణ చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వినతిపత్రాన్ని ఏడీఈ లక్ష్మీనారాయణకు అందజేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆందోళనలో జగతా శ్రీను, పెప్సీ శ్రీను, ఎం.సతీష్, బాధితులు పాల్గొన్నారు.



విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

ఏఈ వివరణ

ఈ విషయమై ఈపీడీసీఎల్ ఏఈ ఎం.నాగేశ్వరరావును వివరణ కోరగా.. విద్యుత్ కనెక్షన్ల కోసం లంచం డిమాండ్ చేసినట్టు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇంటి ప్లాన్లు లేనివాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేమని చెప్పామని, లేఅవుట్లలో భారీ భవంతులు నిర్మిస్తున్నందున ఉన్న లోడ్‌ను పెంచేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాల్సి ఉందని, అవసరమైన డిపాజిట్లు కట్టాల్సి ఉంటుందని చెప్పడంతో ఆరోపణలు చేశారని తెలిపారు.

రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం

కొత్తూరు, జనవరి 2 : మండలంలోని వెంకుపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం వైద్య సిబ్బందితో మంత్రి మాట్లాడారు. రోగులకు నిర్వహిస్తున్న వైద్యపరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, తగరంపూడి వైద్యాధికారిణి పావని, ఎంపీడీవో నర్సింహారావు, సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రాపేటి వెంకటేష్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ప్రజలందరికీ పూర్తి స్థాయిలో ఆధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. మంగళవారం ఏటికొప్పాకలో రెండో విడత సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులంతా సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి అందరికీ సేవలందించాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర పాల్గొన్నారు.



వెంకుపాలెం వైద్య శిబిరంలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

మునగపాకలో.. మండలంలోని ఒంపోలులో ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నబాబు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పి. స్వామి సత్యనారాయణ, వైసీపీ మండలఅధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, పట్టణ వైసీపీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. మండలంలోని బంగారమ్మపాలెంలో రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యుడు రాపేటి అరుణ, నేతలు బోకం రామునాయుడు, కర్రి బాబు, సురేష్‌రాజ్ పాల్గొన్నారు.

వైసీపీకి దాడి గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

చెందారు. అనంతరం దాడి వీరభద్రరావు కుటుంబం వైసీపీ నుంచి బయటకు వచ్చింది. కొంతకాలంపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరతారన్న ఊహాగానాలు వినిపించాయి. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ..2019 సార్వత్రిక ఎన్నికల ముందు మళ్లీ వైసీపీలో చేరారు. అనకాపల్లి అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో ఒకింత నిరాశ చెందారు. అయినప్పటికీ వైసీపీ విజయం కోసం కష్టపడి పనిచేశారు. పార్టీ అధికారంలోకి రావడంతో తగిన ప్రాధాన్యం లభిస్తుందని భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు/ఎంపికలు జరిగినప్పుడు, నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యుల పేర్లు తెరపైకి రావడం, పార్టీ అధిష్ఠానం మొండి చేయి చూపడం జరుగుతూ వస్తోంది. గత ఎన్నికల్లో అమర్ గెలుపునకు కృషి చేసినప్పటికీ పార్టీ పెద్దలు గుర్తించకపోవడం, ఎమ్మెల్సీ సీటు హామీని జగన్ నిలుపుకోలేకపోవడం, సొంత పార్టీ నేతలే తమపై విమర్శలు చేస్తుంటే ఎవరూ ఖండించకపోవడం తదితర పరిణామాలు దాడి వీరభద్రరావు కుటుంబాన్ని బాధించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మలసాల కుటుంబానికి ఎమ్మెల్యే టికెట్ కోసం మంత్రి అమర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సిఫారసు చేయడం, అధిష్ఠానం సానుకూలంగా స్పందించడాన్ని 'దాడి' కుటుంబం తట్టుకోలేకపోయింది. పార్టీ కోసం పనిచేస్తూ సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నప్పటికీ పెద్దల కరుణ లేకపోవడం, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్‌పై భరోసా లభించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందినట్టు తెలిసింది. ఆత్మవంచన చేసుకుంటూ ఇటువంటి పార్టీలో ఉండలేమన్న ఉద్దేశంతో మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ఏకవాక్యంతో లేఖ రాసి పంపారు.

నేడు టీడీపీలోకి 'దాడి' కుటుంబం

వైసీపీకి రాజీనామా చేసిన దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు, అనుచరులు బుధవారం అమరావతిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. దాడి వీరభద్రరావు తన రాజకీయ జీవితాన్ని తెలుగుదేశం పార్టీతోనే మొదలుపెట్టారు. 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1987లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రిగా, 1989 జనవరిలో ఆర్టీసీ రీజియన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1989, 1994, 1999 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఎన్టీఆర్ క్యాబినెట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీ తరఫున శాసనమండలి సభ్యుడిగా ఎన్నియ్యారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. వీరభద్రరావు చిన్న కుమారుడు దాడి రత్నాకర్ 2012-13 మధ్య కాలంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త

» వ్యాధులు ప్రబలుతాయని భయపడుతున్న స్థానికులు

ఎలమంచిలి, జనవరి 2: మునిసిపాలిటీలో పలు చోట్ల ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాల్లో పేరుకుపోయిన చెత్తతో వ్యాధికారక నిలయాలుగా నిలుస్తున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తతో పాటు తుప్పలు పేరుకుపోవడంతో దోమలు పెరగడం, విషసర్పాల సంచారం అధికమైందని వారంటున్నారు. దోమలు స్వైర విహారం చేస్తుండడంతో డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తున్నారని వారంటున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన కూడా వస్తున్నదని స్థానికులు అంటున్నారు. ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలను నిర్వాహకులు పట్టించుకోవడంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని, అంటువ్యాధుల బారిన పడుతున్నామని అంటున్నారు. కొత్తపేట కాలనీ, ధర్మవరం, నాగేంద్ర కాలనీ, గాంధీనగర్ తదితర పలు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుందని అంటున్నారు. సమీప ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా మునిసిపల్ అధికారులు ఖాళీ స్థలాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, లేకుంటే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా యజమానులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.



కొత్తపేట కాలనీలో ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలు

'పేట' వైసీపీ సమన్వయకర్తగా జోగులు



పాయకరావుపేట, జనవరి 2 : పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును పార్టీ అధిష్ఠానం నియమించింది. మంగళవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రకటించిన రెండో జాబితాలో రాష్ట్రంలో 27 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయ కర్తలను నియమించింది. వీరిలో పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గానికి రాజాం ప్రస్తుత ఎమ్మెల్యే కంబాల జోగులును నియమించింది. దీంతో పాయకరావుపేట ఎమ్మెల్యే టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆశావహులకు నిరాశకు గురయ్యారు. కంబాల జోగులు 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు సార్లు వైసీపీ తరఫున పోటీచేసి గెలుపొందారు. ఇదిలావుండగా పాయకరావుపేట ప్రస్తుత ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పిస్తానని సీఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు ఇటీవల ప్రచారం జరిగిన విషయం తెలిసిందే.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నవపీఠాల హారతి పూజ



ఆధ్యాత్మిక వసుధైవకం పుస్తకాన్ని ఆవిష్కరించిన రత్నాకర్

అనకాపల్లి టౌన్, జనవరి 2 : స్థానిక గవరపాలెం ఇండోర్ స్టేడియం వద్ద దుర్గమ్మ నవపీఠాల హారతి పూజ కార్యక్రమం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు హారతి పూజలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ దంపతులను ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, సంతోషి కుమారి దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆధ్యాత్మిక వసుధైవకం అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని రత్నాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురుభవాని మద్దాల శ్రీను, వైసీపీ నాయకులు కొణతాల భాస్కరరావు, పీలా రాంబాబు, కొణతాల మురళీకృష్ణ, డి.కృష్ణప్రేమదాసు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వంటా-వార్పు



శిబిరం వద్ద వంటా-వార్పు చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 2 : జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు మంగళవారం జోనల్ కార్యాలయం వద్ద వంటా-వార్పు చేపట్టారు. అనంతరం కార్మికులంతా సహపంక్తి భోజనం చేశారు. ఉదయం వాహనాలను బలవంతంగా తీయించేందుకు పోలీసులు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని కార్మికసంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ స్పష్టం చేశారు.

తిరువీధి ఉత్సవాలతో ధనుర్మాస శోభ



తిరువీధుల్లో స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 2: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారు, పల్లకీలో గోదాదేవిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. ప్రతి రోజూ పలు వాహనాలపై స్వామివారి తిరువీధి సేవలు జరుగుతుండడంతో ఉపమాక ఆలయం ధనుర్మాస శోభతో కళకళలాడుతోంది. మంగళవారం కొండపైన, కింద వున్న ఆలయాల్లో అర్చకులు పూజలు చేశారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా శంకర్, సత్యనారాయణ



మేడేటి శంకర్



సత్యనారాయణ

నక్కపల్లి, జనవరి 2: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నక్కపల్లికి చెందిన మేడేటి శంకర్, ఎన్ఎస్‌వీ సత్యనారాయణలను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మండలం కాగిత గ్రామానికి చెందిన గుమ్మెళ్ల గోవిందరావును జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నక్కపల్లి మండలం ఉపాధ్యక్షుడిగా ప్రగడ చక్రరావులను నియమించారు.

కొబ్బరి దింపు కార్మికుడికి చేయూత

ఎస్.రాయవరం, జనవరి 2: మండలంలోని గుర్రాజుపేటకి చెందిన శ్రీ సత్యదుర్గ కొబ్బరి దింపు కార్మికుల సంక్షేమ సంఘ సభ్యుడు మునసా దుర్గారావుకు రూ.10,150 నగదును అందజేసినట్టు సంఘం ప్రెసిడెంట్ మునసా సత్తిబాబు తెలిపారు. ఈయన కొద్ది రోజుల క్రితం ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. దీంతో సంఘం తరుపున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గండిబోయిన నూకరాజు పాల్గొన్నారు.

వరాహావతారంలో పాండురంగడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న పాండురంగడు

పాయకరావుపేట, జనవరి 2: దశావతాల్లో భాగంగా పట్టణంలోని రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి మంగళవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి పాండురంగస్వామికి పూజలనంతరం వరహావతారంలో అలంకరించారు. ఆండాళ్ళమ్మ వారికి విశేషాలంకరణ నివేదన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటాద్రి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్



అనకాపల్లి టౌన్, జనవరి 2 : కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా స్థానిక గాంధీనగరానికి చెందిన దాసరి సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్ తెలిపారు. సంతోష్‌కుమార్‌ను గంగాధర్, ఐ.అవినాష్, ఎగ్గాడ భాస్కరరావు, గుణబాబు అభినందించారు.

7న బీసీ సామాజిక చైతన్య సభకు తరలిరండి



చైతన్యసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

కొత్తూరు, జనవరి 2 : ఈనెల 7న విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కాలేజీ గ్రౌండ్‌లో జరగనున్న బీసీ సామాజిక చైతన్య సభకు పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు తరలిరావాలని పార్టీ ఓబీసీ రాష్ట్ర మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చైతన్య సభకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు 56 కార్పొరేషన్లు పెట్టి నిధులు లేకుండా మోసం చేసిందని ఆరోపించారు. విలేకర్ల సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్రా అచ్చంనాయుడు, మోర్చా నేతలు అలమండ శ్రీను, బొడ్డేడ నాగేశ్వరరావు, ఓరిగంటి నాగమణి పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డుల క్లెయిమ్‌లు పునరుద్ధరించాలి

కొత్తూరు, జనవరి 2 : ఈ-శ్రమ్ కార్డుల క్లెయిమ్‌లను వెంటనే పునరుద్ధరించే చర్యల చేపట్టాలని అనకాపల్లి కార్మిక శాఖ సహాయ కమిషనర్ కె.వసంతరావును ఓబీసీ మోర్చా నాయకులు మంగళవారం కోరారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ తదితరులు ఆయన్ని కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలమండ శ్రీను, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎ.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలండర్ ఆవిష్కరణ

సబ్బవరం, జనవరి 2: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీని ఎంపీడీవో రమేశ్ నాయుడు, ఏవో షేక్ బాబూరావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి, పీఆర్‌టీయూ అధ్యక్షుడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వనం భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నేత నానారావు మృతి

ఎస్.రాయవరం, జనవరి 2: మండలంలోని పెనుగొల్లు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మొల్లి నానారావు (55) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మృతి విషయం తెలియగానే టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, నేతలు గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, ఆశా, సుంకర శ్రీనివాస్, ప్రగడ తులసి, దేముళ్ళు ఆ గ్రామానికి వెళ్లి నానారావు భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంచాయతీరాజ్ సదస్సును విజయవంతం చేయాలి

ఎలమంచిలి, జనవరి 1: గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం జరిగే పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పాల్గొని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల నిధులు, అధికారాలను దుర్వినియోగం చేస్తూ గ్రామీణ ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

పరవాడ, జనవరి 2 : టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అట్టా సన్యాసిఅప్పారావు అన్నారు. మంగళవారం ఇ.బోనంగి ఫార్మా పునరావాసకాలనీలో బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మినీ మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల భవితకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరవాడ రైతుల నిరసన

పరవాడ, జనవరి 2: పరవాడ పెద్ద చెరువు ఆయకట్టు రైతులు చేపడుతున్న నిరసన మంగళవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు రాంకీ ఫార్మా తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. న్యాయం చేయాలని 23 రోజులుగా నిరసన చేపడుతున్నప్పటికీ అధికారులు గాని, రాంకీ యాజమాన్యం గాని పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. న్యాయం జరిగే వరకు దీక్షలు కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు ఎస్ఎస్ నాయుడు, కె.సూరిబాబు, సిరపురపు సన్యాసినాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకటరావు



మునగపాక, జనవరి 2 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మునగపాకకు చెందిన టెక్కలి వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మంగళవారం నియామకపత్రం అందింది. వెంకటరావు 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు, ఎలమంచిలి నియోజక ఇన్‌చార్జి కూండ్రపు అప్పారావులకు వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేయించుకున్న పేదలు

అనకాపల్లి టౌన్, జనవరి 2: స్థానిక ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో ఏడుగురు నిరుపేదలకు ఉచితంగా మంగళవారం కంటి ఆపరేషన్లు నిర్వహించారు. సోమవారం ఆస్పత్రికి 25 మంది కంటి రోగులు రాగా వారికి నేత్ర వైద్య సహాయకురాలు పి.దేవి పరీక్షలు నిర్వహించి ఏడుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించిందని ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. వీరికి మంగళవారం డాక్టర్ కె.మల్లేశ్వరరావు ఐఓఎల్ ఆపరేషన్లు నిర్వహించారన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఐదు రోజులకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఏఎస్ పేటలో పశువైద్య శిబిరం



పాడి రైతులతో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

కశింకోట, జనవరి 2: మండలంలోని తాళ్లపాలెం పాల సంఘం ఆధ్వర్యంలో ఏఎస్‌పేటలో మంగళవారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు సందర్శించారు. ఈసందర్భంగా పాడి పశువులకు తరచూ వస్తున్న అనారోగ్య సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, మందులు రైతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి యూనిట్ అధికారి శ్రీను, సూపర్‌వైజర్ సత్యనారాయణ, అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి

- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం
- యరకన్నపాలెం, వేములపూడిలలో విస్తృతంగా పర్యటన
- వైద్య సేవలతో పాటు పాఠశాలల్లో సమస్యలపై ఆరా


యరకన్నపాలెంలో ఆరోగ్య సురక్ష అమలును పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సీపట్నం అర్బన్, జనవరి 2 : మండలంలోని యరకన్నపాలెం, వేములపూడి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. తొలుత యరకన్నపాలెంలో రెండో విడతలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడి వారికి అందిస్తున్న వైద్య సేవలను డీఎంహెచ్‌వో డాక్టర్ టి.హేమంత్ ఆయనకు వివరించారు. అనంతరం వేములపూడిలో గల బాలికల వెనుకబడిన తరగతుల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల హాజరు, వసతి గృహంలో సమస్యలు తదితరాలపై బీసీ వెల్ఫేర్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి, వార్డెన్ బీవీ లక్ష్మిల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులకు సదుపాయాలు, అదనపు డార్మెటరీ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తనకు పంపించాలని సూచించారు. అక్కడి నుంచి పీబీఎం హైస్కూల్, కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్ర భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ అన్నాజీరావు, ఎంపీటీసీ బోళం రామ్‌ప్రసాద్, సర్పంచ్ కె.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

- అడ్డుకున్న తెనుగుపూడి గ్రామస్థులు
- తవ్వకందారులకు మద్దతు పలికిన వైసీపీకి చెందిన ఉప సర్పంచ్
- ప్రశ్నించిన టీడీపీ శ్రేణులతో వాగ్వాదం


ఘర్షణ పడుతున్న ఇరువర్గాలను వారిస్తున్న ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి, జనవరి 2 : మండలంలోని తెనుగుపూడిలో గల శారదా నది వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో మంగళవారం అక్రమంగా ఇసుక తవ్వుతుండడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఇసుక తవ్వకందార్లకు మద్దతు తెలుపున్న వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ కాటిపాము వెంకట సత్యనారాయణకు, తెనుగుపూడికి చెందిన భీముని పోతురాజు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, మరికొంత మంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య మాటామాటా పెరగడంతో దేవరాపల్లి ఎస్‌ఐ నాగేంద్రకు సమాచారం అందింది. వెంటనే ఆయన సిబ్బందితో వచ్చి ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయించారు. సమీపంలోని గర్శింగి గ్రామంలో జరుగుతున్న రోడ్డు పనుల కోసం ప్రభుత్వం నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందని వైసీపీ నాయకులు చెప్పడంతో ఎస్‌ఐ సదరు కూపన్లను పరిశీలించారు. కూపన్లు గర్శింగిలో జరుగుతున్న పనుల నిమిత్తం ఇచ్చినట్టు ఉందని ఎస్‌ఐ అక్కడివారికి తెలిపారు. దీనిపై టీడీపీకి చెందినవారు మాట్లాడుతూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వడానికి అనుమతులు ఇచ్చారా... అని ప్రశ్నించారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని వారు ఆరోపించారు. అయితే తవ్విన ఇసుకను రెండు ట్రాక్టర్ల ద్వారా గర్శింగి వైపు కాకుండా దేవరాపల్లి వైపు వెళ్లడంతో ఆ ట్రాక్టర్లతో సహా ఎక్స్‌కవేటర్‌ను ఎస్‌ఐ తహసీల్దార్‌కు అప్పగించారు. అనంతరం ఇరువర్గాల వారికి ఎస్‌ఐ సర్దిచెప్పి అక్కడినుంచి పంపివేశారు. ఇదిలావుంటే, ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించినందుకు తనను కొట్టారంటూ పోలీస్ స్టేషన్‌లో భీముని పోతురాజు ఫిర్యాదు చేశారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష పథకం : బూడి


బి.కింతాడలో శిబిరాన్నిపరిశీలిస్తున్న బూడి

దేవరాపల్లి/బుచ్చెయ్యపేట, జనవరి 2 : మండలంలోని బి.కింతాడలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పరిశీలించారు. పేదలకు ఈ పథకం వరమన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజశ్వరి, కె.కోటపాడు జడ్పీటీసీ ఈర్లె అనూరాధ, ప్రత్యేకాధికారి రవీంద్ర పాల్గొన్నారు. అలాగే, బుచ్చెయ్యపేట మండలం మల్లాంలో జరిగిన శిబిరాన్ని విప్ ధర్మశ్రీ పరిశీలించారు. ఎంపీడీవో సువర్ణరాజు, సర్పంచ్ బర్ల శివ, వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణి, డాక్టర్ సునీల్ దేవ్ పాల్గొన్నారు.

వైసీపీకి 'దాడి' గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

చెందారు. అనంతరం దాడి వీరభద్రరావు కుటుంబం వైసీపీ నుంచి బయటకు వచ్చింది. కొంతకాలంపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరతారన్న ఊహాగానాలు వినిపించాయి. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ.2019 సార్వత్రిక ఎన్నికల ముందు మళ్లీ వైసీపీలో చేరారు. అనకాపల్లి అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో ఒకింత నిరాశ చెందారు. అయినప్పటికీ వైసీపీ విజయం కోసం కష్టపడి పనిచేశారు. పార్టీ అధికారంలోకి రావడంతో తగిన ప్రాధాన్యం లభిస్తుందని భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు/ఎంపికలు జరిగినప్పుడు, నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యుల పేర్లు తెరపైకి రావడం, పార్టీ అధిష్ఠానం మొండి చేయి చూపడం జరుగుతూ వస్తోంది. గత ఎన్నికల్లో అమర్ గెలుపునకు కృషి చేసినప్పటికీ పార్టీ పెద్దలు గుర్తించకపోవడం, ఎమ్మెల్సీ సీటు హామీని జగన్ నిలుపుకోలేకపోవడం, సొంత పార్టీ నేతలే తమపై విమర్శలు చేస్తుంటే ఎవరూ ఖండించకపోవడం తదితర పరిణామాలు దాడి వీరభద్రరావు కుటుంబాన్ని బాధించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మలసాల కుటుంబానికి ఎమ్మెల్యే టికెట్ కోసం మంత్రి అమర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సిఫారసు చేయడం, అధిష్ఠానం సానుకూలంగా స్పందించడాన్ని 'దాడి' కుటుంబం తట్టుకోలేకపోయింది. పార్టీ కోసం పనిచేస్తూ సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నప్పటికీ పెద్దల కరుణ లేకపోవడం, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్‌పై భరోసా లభించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందినట్టు తెలిసింది. ఆత్మవంచన చేసుకుంటూ ఇటువంటి పార్టీలో ఉండలేమన్న ఉద్దేశంతో మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ఏకవాక్యంతో లేఖ రాసి పంపారు.

నేడు టీడీపీలోకి 'దాడి' కుటుంబం

వైసీపీకి రాజీనామా చేసిన దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు, అనుచరులు బుధవారం అమరావతిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. దాడి వీరభద్రరావు తన రాజకీయ జీవితాన్ని తెలుగుదేశం పార్టీతోనే మొదలుపెట్టారు. 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1987లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రిగా, 1989 జనవరిలో ఆర్టీసీ రీజియన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1989, 1994, 1999 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఎన్టీఆర్ క్యాబినెట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీ తరఫున శాసనమండలి సభ్యుడిగా ఎన్నియ్యారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. వీరభద్రరావు చిన్న కుమారుడు దాడి రత్నాకర్ 2012-13 మధ్య కాలంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.


చోడవరంలో దున్నపోతుకు వినతిని అందిస్తున్న అంగన్‌వాడీలు


నర్సీపట్నంలో...


రావికమతంలో...


బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో...

అంగన్‌వాడీల వినూత్న నిరసన

- ఆందోళనపై ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగ్రహం
- డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు దున్నపోతులకు సమర్పణ



రోలుగుంటలో దున్నపోతుకు వినతిపత్రం అందిస్తూ.. డిమాండ్లపై నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


దేవరాపల్లిలో...


నాతవరంలో...

చోడవరం, జనవరి 2 : డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం చోడవరంలో వినూత్నంగా నిరసన తెలిపారు. దున్నపోతుకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం తమపట్ల అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా అంతా నినాదాలు చేశారు. ఆందోళనను అణచివేసే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్వీ నాయుడుతో పాటు, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు సూర్యకాంతం, కొం డమ్మ, జగదీశ్వరి, కృష్ణవేణి, అరుణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో అంగన్‌వాడీలు వినూత్న రీతిలో మంగళవారం నిరసన తెలిపారు. తమ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రాన్ని దున్నపోతుకు అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సంఘం ప్రతినిధులు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా తాము పోరాటం చేస్తున్నా సీఎం జగన్ స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అదీకాక ఈ నెల ఐదో తేదీలో సమ్మె విరమించకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం అల్టిమేటం జారీ చేయంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కరించే వరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు.

నర్సీపట్నం : అంగన్‌వాడీలు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం ఇక్కడ దున్నపోతుకు సమర్పించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నాణ్యమైన సరకులు సరఫరా చేయాలని కోరారు. అనంతరం సంఘం నాయకురాలు వి.సామ్రాజ్యం మాట్లాడుతూ ఇరవైరెండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. డి.మహాలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : డిమాండ్లపై అంగన్‌వాడీలు చేపడుతున్న ఆందోళన రోజు రోజుకు ఉధృతమవుతోంది. ఈ సందర్భంగా నాతవరంలో మంగళవారం ధర్నా నిర్వహించి దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేశారు. వీరి ఆందోళనకు టీడీపీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి వీరికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పట్టువదలని విక్రమార్కుడి వలె అంగన్‌వాడీలు ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వంలో స్పందన లేకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో టీడీపీ నాయకులు పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్ కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, తెలుగుయువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తల నాయకురాళ్లు ఎస్.పద్మజ, సత్యవతి, రాజేశ్వరి, సత్యవేణి పాల్గొన్నారు.

రావికమతం : సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఆందోళనలో భాగంగా రావికమతంలో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేశారు. దీర్ఘకాలంగా తాము ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని సంఘం నాయకులు సత్యవేణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోలుగుంట : అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రాన్ని మంగళవారం ఇక్కడ దున్నపోతుకు అందజేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే తమ ఆందోళనపై స్పందించాలన్నారు. న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

మాడుగుల: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళనను మంగళవారం మరింత తీవ్రతరం చేశారు. ఇందులో బస్టాండ్ ఆవరణలోని దీక్షా శిబిరం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలంతా పాల్గొన్నారు.

దేవరాపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఆం దోళనను మరింత ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రాన్ని దున్నపోతుకు అందజేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు.

చీడికాడ : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొం గలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం చుక్కపల్లి, తురువోలు, అర్జునగిరి సచివాలయాల వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో మాట్లాడారు. అనంతరం ఆయా సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు ర్యాలీ

నర్సీపట్నం, జనవరి 2 : పారిశుధ్య కార్మికుల ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. ఇందులో భాగంగా పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సీబీఎం కాంపౌండ్ నుంచి అబీద్ సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం తదితరాల మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నల్ల జెండాలు చేతబట్టి నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, కొవిడ్ సమయంలో తాత్కాలిక విధులు నిర్వహించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఏడు రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. మెయిన్ రోడ్డు, వార్డులలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసన భరించలేకపోతున్నారు. చెత్త తరలింపునకు అధికారులు ఏర్పాట్లు చేయాల్సిందిగా వారంతా కోరుతున్నారు.


నర్సీపట్నంలో నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

'ఆర్టీసీలో ఉచిత రవాణాతో ఆటో కార్మికుల పొట్టకొట్టవద్దు'


ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న లక్ష్మణ

బుచ్చెయ్యపేట, జనవరి 2 : ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా పథకం అమలు ద్వారా ఆటో కార్మికుల పొట్ట కొట్టవద్దని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. మంగళవారం ఆయన సీతయ్యపేటలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. కర్ణాటక, తెంగాణలలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత రవాణా పథకం అమలు చేయడం ద్వారా ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఆటో రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా పది లక్షల మైబడి కార్మికులు జీవిస్తున్నారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏపీలో ఆర్టీసీలో ఉచిత రవాణా పథకం ఆలోచనను విరమించుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, ఎస్.కె.రెహ్మాన్, బంగారి రాజు, రవి నాని, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన


ఈవీఎంల వినియోగంపై అవహన కల్పిస్తున్న ఆర్ఐ

గొలుగొండ, జనవరి 2 : ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఓటర్లకు మంగళవారం రెండు గ్రామాల్లో అవగాహ కల్పించారు. పప్పుశెట్టిపాలెం సామాజిక భవనం, జోగంపేట ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటైన ఈ సదస్సుల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును ఎలా వేయాలి తదితరాలపై రెవెన్యూ అధికారులు వివరించారు. ఆర్ఐ నాగరాజు, సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు జక్కు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంటు పనులపై సీపీఎం ఆగ్రహం

- బల్లిపురం వద్ద పర్యటించిన లోకనాథం
- నిర్మాణం జరిగితే భారీ నష్టమని ఆందోళన


హైడ్రో పవర్ ప్లాంటు పనులను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

దేవరాపల్లి, జనవరి 2 : మండలంలోని చింతలపూడి పంచాయతీ బల్లిపురం సమీపంలో హైడ్రో పవర్ ప్లాంటు పనులు చేపట్టడంపై సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగవారం ఆ ప్రాంతాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పనులు కోల్‌కతా కంపెనీకి అప్పగించేందుకు మట్టి పరీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పనులు జరిగితే అటు చింతలపూడి పంచాయతీలోని తొమ్మిది గ్రామాలు, తామరబ్బ పంచాయతీలోని ఏడు గ్రామాలతో పాటు, రైవాడ ఆయకట్టు సాగు, తాగునీటికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శారదా నది సమీపం కావడంతో నష్టం ఎక్కువ ఉంటుందన్నారు. యంత్రాలను వెనక్కు తీసుకు వెళ్లకుంటే ఆందోళనను చేపడతామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, బి.టి.దొర తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో అభివృద్ధి పనులపై గ్రామ సభ

కృష్ణాదేవిపేట, జనవరి 2 : మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. అలాగే మరిన్ని అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు చింతల బుల్లి ప్రసాద్, మామిడి కృష్ణ, కార్యదర్శి రాజేష్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

విషాహారం తిని రెండు పాడి పశువులు మృత్యువాత

చీడికాడ, జనవరి 2 : మండలంలోని అర్జునగిరిలో రెండు పాడి పశువులు విషాహారం తిని మృత్యువాత పడ్డాయి. మంగళవారం పెంటకోట పైడిబాబు అనే రైతు తన పశువులను పాక నుంచి మేతకు తోలుకువెళ్లాడు. తిరిగి కల్లంలోకి వచ్చిన తరువాత హఠాత్తుగా నేలపై కుప్పకూలి మృతిచెందాయి. దీంతో మేతమేసిన సమయంలో ఎక్కడో విషాహారం తిని ఉంటాయని సదరు రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం ఇప్పించాల్సిగా కోరుతున్నారు.

రాజ్యాధికారమే యాదవుల లక్ష్యం కావాలి

- సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సన్యాసిరావు

చీడికాడ, జనవరి 2 : రాజ్యాధికారం కోసం యాదవ సామాజికవర్గ సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలని యాదవ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్.ఎస్.పురంలో మాడుగుల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ మొల్లి సన్నిబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని యాదవ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు ప్రధాన కులాల తరువాత మూడో స్థానంలో యాదవులు ఉన్నారన్నారు. అయినప్పటికీ పార్లమెంటు, అసెంబ్లీ సీట్ల కేటాయింపులో వివిధ పార్టీల నాయకులు మొండిచేయి చూపుతున్నారని వాపోయారు. రాజ్యాధికారమే లక్ష్యంగా అంతా ముందుకు సాగితేనే తమకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంఘం అనకాపల్లి పార్లమెంటు నాయకుడు నమ్మి అప్పలరాజు, జిల్లా నాయకులు పినబోయిన అప్పారావుయాదవ్, గంటా శ్రీరామ్, కాగిన వెంకటరమణ, చిన్నియాదవ్, బందం వెంకటరమణ, కోన నాగేశ్వరరావు, ప్రగడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనంలో చెట్టుపల్లి విద్యార్థిని సాయి శివానీ ప్రతిభ


సాయి శివానీని అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం అర్బన్, జనవరి 2 : మండలంలోని చెట్టుపల్లి హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న వెంకాయల సాయి శివానీ రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఐదో స్థానంలో నిలిచింది. భారతీయ విద్యా మండలి, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా గత నెల 30న విజయవాడలో ఈ పోటీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సాయి శివాని ఇస్రో సాధించిన విజయాలను పేర్కొంటూ వేసిన 'ఇస్రో భారతీయ అభివృద్ధి మైలురాయి' చిత్రానికి ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఆమెను నిర్వాహకులు అవార్డుతో సత్కరించారు. ఇదిలావుంటే, మంగళవారం ఇక్కడ ఎమ్మెల్యే గణేశ్, ఆర్డీవో జయరాం ఆమెను అభినందించారు. హెచ్ఎం నర్సింగరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సముద్రాలు, వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు దండిన నానాజీ, రాజగోపాల్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అంక్షితలు పంపిణీ

బుచ్చెయ్యపేట, జనవరి 2 : అయోధ్యలో శ్రీరాముని పూజకు వినియోగించిన అంక్షితలను మంగళవారం కొండపాలెం, కేపీఅగ్రహారం, పెదమదీనా, గున్నెంపూడి గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో జరిగే వేడుక సందర్భంగా వీటిని పూజలు జరిపి తలపై వేసుకోవాలని ఫౌండేషన్ ప్రముఖ్ ఎం.వి.నాగేశ్వరరావు సూచించారు.

'కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయండి'


చీరలు పంపిణీ చేస్తున్న కాశీవిశ్వనాథరాజు

నాతవరం, జనవరి 2 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడంతో పాటు వాటిపై ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం నాతవరంలో ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందన్నారు. అనంతరం అమ్మ వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన చీరలు, దుప్పట్లను పేదలకు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు లాలం వెంకటరమణ, అఖిలగాండ్ల సామాజికవర్గం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్, అమ్మ వాసవీ సేవా సంఘం అధ్యక్షురాలు ఇటంశెట్టి అక్కయ్యమ్మ, పేరూరి బుల్లిదొర, గవిరెడ్డి త్రినాథ్, చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

'బాలికపై అత్యాచారానికి పాల్పడడం దారుణం'

నర్సీపట్నం, జనవరి 2 : విశాఖ నడిబొడ్డున దళిత బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి పాపారావు, నేతల నాగేశ్వరరావు, గాతాడ సహదేవుడు, మర్ర గోపి, కిడారి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.